సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 17-12-2024

సంపుటి: 20 సంచిక: 224

పేజీలు: 4 వెల: రూ.1



## అదుపులో ఏడుగురు...

# లైన్‌లో నలుగురు

- పలాస కుట్ర కేసులో వేగం పెంచిన పోలీసులు
- టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ హత్యకు ప్లాన్ వైకాపాదే
- బడ్డ నాగరాజు వేధింపుల కారణంతోనే స్కెచ్?
- గతంలో వైకాపా ఆగడాలను సీదిరి పట్టించుకోని ఫలితం

- వివరాలు 3లో



• ఎడిటోరియల్

# ఈ ప్రపంచం పిల్లలదే..!

పాఠశాలంటే ఎత్తైన భవనాలు, చుట్టూ ప్రహరీ గోడలు, ఖరీదైన స్కూల్ యూనిఫామ్‌లు కాదు. మానవ జీవితాలను తీర్చిదిద్ది, జాతి భవితను రూపొందించే జీవన నిలయాలు, చైతన్య కేంద్రాలు. మానవీయ విలువల్ని పాదుకొలిపే ఆధునిక దేవాలయాలు. మంచి వాతావరణం, సారవంతమైన నేలలో నాణ్యమైన విత్తనాలు విత్తితేనే, చక్కటి ఫలాలనిచ్చే వృక్షాలుగా ఎదుగుతాయి. తల్లిని నేల/నీరుగా.. తండ్రిని విత్తనంగా భావిస్తే.. ఉపాధ్యాయుడు సూర్యరశ్మి లాంటివాడు. వీరు ముగ్గురు మాత్రమే చిన్నారులను మంచి పౌరులుగా మలచగలుగుతారు. బడిని బాగు చేయడాన్ని రేపటి పెట్టుబడిగా గుర్తించాలి. బాలకార్మికులు కనిపిస్తే విడిపించి యాజమాన్యాలపై కేసులు పెట్టాలి. పిల్లలు పనిలో కాదు. బడిలో ఉండాలి. బడికి రాని పిల్లలందరూ బాలకార్మికులే. బాల్యం ఒక హక్కు. పిల్లల చదువుల ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించి, కేరళ సమాజాన్ని ఒప్పించి 'బాల్యం బడిలోనే' ఉండాలని తీర్మానించింది అక్కడి ప్రభుత్వం. పాఠశాల మాత్రమే పిల్లలను పట్టించుకునే ఏకైక సంస్థగా గుర్తించింది. పిల్లల సర్వతోముఖ వికాసానికి తగినట్టుగా పాఠశాలలను అభివృద్ధి చేసింది. అంతర్జాతీయ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది. చదువుతో పాటు ఆటపాటలు, ఆట స్థలాలు లేని స్కూళ్లకు అనుమతులుండవు. ప్రతి పాఠశాలలో పీఈటీ, డ్రామా, స్క్రిప్ట్, డాన్స్ టీచర్ తప్పకుండా ఉండాలి. ఆధునిక విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. వీటికి సంబంధించిన శిక్షణ తరగతులు, ప్రణాళిక ప్రతి బిడ్డకు ఉపయోగపడేలా చూస్తారు. సమాజం భాగస్వామ్యం కాకుండా కేవలం ప్రభుత్వ కృషి ఫలితాలివ్వదు. అందుకే అన్ని రంగాల్లో ప్రజల భాగస్వామ్యంతోనే ప్రణాళికలు అమలుజరుగుతాయి. విద్యార్థులు ఫెయిల్ అయితే ఉపాధ్యాయులే ఫెయిల్.. విద్యా విధానం ఫెయిల్ అయినట్టుగా చూస్తారు. పిల్లల మనోధైర్యానికి మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తారు. ప్రాచీన నృత్యాలలో శిక్షణ ఇస్తారు. అర్థం కాని పాఠ్యాంశాలను కళారూపాల ద్వారా మనసులో నాటుకునేలా చెప్తారు. దాంతో ఆటపాటలు చిన్నారుల నిత్య జీవితంలో భాగమైనాయి. 'సమగ్ర' అనే పోర్టల్ ద్వారా కేరళ విద్యాశాఖ వెయ్యికి పైగా ప్రభుత్వ పాఠశాలలను డిజిటల్ పాఠశాలలుగా మార్చి 45 వేల స్మార్ట్ రూములను నిర్మించింది. లిటిల్ కైట్స్, ఐటీ క్లబ్బులను ఏర్పాటుచేసి యూనిమేషన్, షార్ట్ ఫిలిమ్స్, సైబర్ భద్రత వంటి అంశాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి విద్యార్థికి మధ్యాహ్న భోజనంలో గుడ్డు, వారానికి ఒకరోజు చికెన్ పెడతారు. 3వేల మంది పిల్లలు ఒకేసారి కలిసి భోజనం చేసే డైనింగ్ హాల్, పేరెంట్స్ విజిటింగ్ హాల్, పెద్ద కిచెన్ వుంటాయి. పరిశుభ్రత విషయంలో పక్కాగా వుంటారు. స్కూల్ ఆవరణలో ఒక ఆకు పడ్డా విద్యార్థులే ఏరి చెత్త బుట్టలో వేస్తారు. ప్రతి స్కూల్లో ఇండోర్ స్టేడియం వుంటుంది. విద్య ఒకటే కాదు. ఏ విద్యార్థికి ఏ రంగంలో ఆసక్తి ఉంటే ఆ రంగంలో తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించగలిగేలా శిక్షణనిస్తారు. ఒక మాటలో చెప్పాలంటే? ఒక నిరుపేద విద్యార్థికి అంతర్జాతీయ స్థాయి విద్య ఉచితంగా అందుతుంది. భవితకు బలం బాలల సంఘాలే పిల్లల సాంస్కృతిక ఉత్సవాలు 'వేనలుంబికల్' (వీధి నాటకాలు) ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే నెలలో జరుగుతాయి. 4వేల మంది బాల కళాకారులు 210 బృందాలుగా బాలల సామాజిక సమస్యలపై లక్షలాది మందితో ప్రదర్శనలిచ్చి పెద్దలలో సైతం చైతన్యం కల్పిస్తారు. ఆటపాటల్లో సత్తా చాటుతున్న వారిని చిన్న వయస్సులోనే చేరదీసి ప్రోత్సహిస్తున్నారు. శిక్షణలిచ్చి విశ్వక్రీడల్లో విజేతలుగా నిలబెడుతున్నారు. వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపులను శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్నారు. మలయాళంలో బాల సాహిత్య అకాడమీ ఏర్పరిచారు. బాలల రచనలు, ముద్రణలు అక్కడి నుంచి వెలువడతాయి. ప్రతి ఇంట్లో లైబ్రరీ క్యాంపెయిన్ నిర్వహించి పఠనాసక్తిని పెంచుతారు. బాలల కార్యక్రమంలో కుటుంబాలు, పెద్దలు పాల్గొంటారు. రాజ్యాంగ పీఠికను చదివించడం బాలల అసెంబ్లీ, పార్లమెంటు కార్యక్రమాలు, లౌకిక, మానవత్వ, సమతా మమతల పండుగలు, వనభోజనాలు నిర్వహిస్తారు. సూర్యచంద్ర గ్రహణాలు, మూఢనమ్మకాలను సవాల్ చేస్తూ 10వేల మంది పిల్లలు రోడ్ల మీదకొచ్చి గ్రహణాన్ని వీక్షించారు. సైన్స్ వండర్ షోలు, ఒక్క మాటలో చెప్పాలంటే? ఈ ప్రపంచం పిల్లలదే. ఎదగడానికి ఎల్లలు లేవు అన్నట్లుగా విజ్ఞాన ఆధారిత సమాజ నిర్మాణంలో కేరళ ప్రణాళిక బద్ధంగా ముందడుగు వేస్తున్నది.



అరవై నాలుగు తెలుపు నలుపు గళ్ల పలక అతడికి యుద్ధ రంగం.. అతడే రాజు.. అతడే మంత్రి.. అతడే సర్వసైన్యాధ్యక్షుడు.. అతడే కాల్బలం.. అతడు ఏనుగును లొంగదీసుకుని నడిపిన మావటి.. అతడు గుర్రాన్ని అధిరోహించి పరుగులు పెట్టించిన ఆశ్వికుడు.. అతడు ఎడారిలో ఒంటె మీద ఒంటరి ప్రయాణం చేసిన యోధుడు.. అతడిప్పుడు చదరంగ రథగజ తురగ పదాతిసమావృత పరిజన మండిత లోకనుతుడు. ఒక్కొక్క ఎత్తులో ప్రత్యర్థిని చిత్తు చేసి ప్రపంచ చదరంగ రారాజుగా విజయ సింహాసనం అధిష్ఠించిన జగజ్జేత.

# శభాష్ గుకేష్



**దొమ్మరాజు గుకేష్. వయసు పద్దెనిమిదేళ్లు. చిత్తూరు జిల్లా నుంచి తమిళనాడు చెన్నయ్ వెళ్లి స్థిరపడ్డ కుటుంబం. ఇంట్లో అందరూ ఇప్పటికీ తెలుగే మాట్లాడతారు. తండ్రి రజనీకాంత్ ఈఎన్‌టీ డాక్టర్. తల్లి పద్మకుమారి మైక్రోబయాలజిస్ట్. ఇంకా చాలా వివరాలు మెయిన్ స్ట్రీమ్ మీడియాతో పాటు సోషల్ మీడియాలో అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి ఉన్నవారు గూగులించవచ్చు.**

కొడుకును జగజ్జేతను చేయడానికి తండ్రి డాక్టర్‌గా ప్రాక్టీస్ మానేసి.. కొడుకుతో పాటు తిరుగుతూ ఉండడం.. తల్లి జీతంతో ఇంటిని నెట్టుకొస్తూ కొడుకు కలలను నిజం చేయడం గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది.




విశ్వనాథన్ ఆనంద్ తర్వాత భారత్‌కు చదరంగ జగజ్జేత కీర్తి కిరీటం పెట్టినవాడు పద్దెనిమిదేళ్ల గుకేష్. దాని విలువ ఎంతో గెలిచాక చెస్ బోర్డుపై సంప్రదాయంగా ఎక్కడి పావులను అక్కడే సర్దుతున్న గుకేష్‌కు పొంగుకొస్తున్న కన్నీళ్లను చూస్తే తెలుస్తుంది. కొడుకు జగజ్జేతగా అవతరించబోతున్న క్షణాల్లో




సింగపూర్లో ఫిడే– ప్రపంచ చెస్ సమాఖ్య క్రీడా వేదిక గుమ్మం ముందు, వసారాల్లో ఆనందంతో నోటమాటరాక.. తారాడుతూ.. తర్వాత పరుగున వెళ్లి అభినందనగా కొడుకును కౌగలించుకున్న తండ్రిని, వారిద్దరి కళ్లల్లో జలజలా రాలిన ఆనంద బాష్పాలను చూస్తే దాని విలువ ఎంతో తెలుస్తుంది.

మనం రజనీకాంత్‌లా భద్రమైన ఉద్యోగం వదిలి కొడుకు, కూతుళ్ల అభిరుచులకు తగిన దారిలోకి వెళ్లనివ్వం కాబట్టి.. ఆటలంటే అంటరానివిగా చూస్తాము కాబట్టి.. నామకరణం రోజే ఐఐటీ అడ్వాన్స్ కోచింగ్ సెంటర్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష కోసం కోచింగ్ ఇచ్చే మరో సెంటర్లో అడ్వాన్స్ కడతాం కాబట్టి.. అన్నప్రాశన రోజే మెయిన్స్‌కు పూర్తి ఫీజు కడతాం కాబట్టి.. లాంగ్ టర్మ్ సెల్ఫ్ డిస్ట్రక్షన్ ఇంటిగ్రేటెడ్ మెగా దగా సూపర్ రిఫైనరీ ఇంటర్ అత్యుత్తమ టీచింగ్ మెరిక క్లాసులో మన పిల్లలు పడడానికి కోటి దేవుళ్లకు మొక్కుకుంటాం కాబట్టి.. మార్కులు, ర్యాంకులు అందునా అంకెలో అంకెగా ఒకటిగా మన పిల్లలు మిగిలిపోవాలని అనుకుంటాం కాబట్టి.. రజనీకాంత్ మనకు వింతగా కనిపిస్తారు. ఆశ్చర్యం అనిపిస్తారు.

నిజానికి ఆ తండ్రి అకుంఠిత దీక్ష అద్భుతం. ఆ తల్లి ఓర్పు కూడా అద్భుతం. వారి అరచేతుల మీద పెరుగుతూ.. చదరంగం ఆడి.. వారి అరచేతుల్లో జగజ్జేత కీర్తి కిరీటాన్ని బహుమానంగా పెట్టిన ఆ కొడుకు పరమ అద్భుతం.

- పమిడికాల్వ మధుసూదన్


అమ్మా నాన్న అండగా...
Courtesy: Sakshi

## ఎంపీ కలిశెట్టికి బ్లాక్‌రైస్ అందించిన రైతు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విజయనగరం పార్లమెంట్‌సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడుకు ప్రకృతి వ్యవసాయం రైతు జాతీయ రైతునేస్తం అవార్డు గ్రహీత పెంకిగౌరీశ్వరరావు కుటుంబసభ్యులు వారి పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కాలాబట్ (బ్లాక్ రైస్) అందజేశారు రైతునేస్తం పురస్కార గ్రహీత గౌరీశ్వరరావును యన్ఆర్ఐ లోలుగు మదన్‌తో కలసి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు పొలంలో పనిచేసే రోజుల్లో ఉపాధి పని అనుసంధానం చేసే విధంగా వారి సొంతంగా పొలంలోపనిచేసినా కూలి లభించేవిధంగా పార్లమెంటులో ప్రశ్నిస్తానన్నారు పెరిగిన కూలిరేట్లతో కూలీల కొరతతో పెరిగిన విత్తనాల ధర రసాయన ఎరువు ధరలతో పంట గిట్టుబాటు గాక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఈతరుణంలో రైతులను ఆదుకునేందుకు ప్రకృతి వ్యవసాయమే మేలన్నారు. ఈ కార్యక్రమంలో పెంకి చైతన్యకుమార్, చిన్నమ్మడు, అరుణకుమారి, ఉరిటి శశి, దంగుడు బియ్యం శ్రీను అసిరినాయుడు పాల్గొన్నారు






















# అదుపులో ఏడుగురు... లైన్‌లో నలుగురు



**పలాస కుట్ర కేసులో వేగం పెంచిన పోలీసులు । టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ హత్యకు ప్లాన్ వైకాపాదే**

**నాగరాజు వేధింపుల కారణంతోనే స్కెచ్? । గతంలో వైకాపా ఆగడాలను సీదిరి పట్టించుకోని ఫలితం**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పలాస పట్టణ టీడీపీ అధ్యక్షుడు బద్ద నాగరాజు హత్యకు కుట్ర పన్నినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న మరో ఇద్దర్ని పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. ఈ కేసులో మరో నలుగుర్ని అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు సిద్ధమవుతున్నట్టు భోగట్టా. ఇప్పటికే చిన్నబాడాంలో వైకాపా మద్దతు దారులు నిరంజన్, సుందరరావు, రమణయ్యలకు పోలీసులు హింట్ ఇచ్చారని, కుట్ర కేసులో ఎవరెవరు ఉన్నారో స్వచ్ఛందంగా లొంగిపోవాలని, లేదంటే వారిని అప్పగించాలని పోలీసులు చిన్న బాడాంలోని వైకాపా నాయకులకు వార్నింగ్ ఇచ్చినట్టు తెలిసింది. ఈ కేసులో పోలీసుల అదుపులో ఉన్న కూర్మాపు ధర్మారావు, అంపోలు శ్రీనివాసరావును నరసన్నపేటలో విచారించిన పోలీసులు మరికొందరికి కూడా దీంతో సంబంధం ఉన్నట్టు గుర్తించినట్టు తెలిసింది. దీంతో మందస మండలం జిల్లుండి గ్రామానికి చెందిన రౌతు చందు అనే యువకుడిని, చిన్నబాడాంకు చెందిన కోట శ్రీనివాస్ అనే యువకుడిని సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారని స్థానికులు చెప్పుకుంటున్నారు.

పోలీసులు అదుపులోకి తీసుకున్న జిల్లుండి యువకుడు చందు బీహార్‌కు చెందిన సుపారీ గ్యాంగ్ ముగ్గురు సభ్యులకు ఆశ్రయం కల్పించి ఆహారం సరఫరా చేసినట్టు పోలీసులు గుర్తించారని విశ్వసనీయ సమాచారం. ముగ్గురు సుపారీ గ్యాంగ్ సభ్యులు టెక్కలి క్వారీ వద్ద గొడవపడి పోలీసులకు చిక్కినట్టు మొదట ప్రచారం జరిగినా అందులో వాస్తవం లేదని తెలిసింది. ఈ ముగ్గుర్ని పలాస సమీపం లోని కోసంగిపురం జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా కాశీబుగ్గ పోలీసులు గుర్తించి తనిఖీ చేసి నాటుతుపాకీతో పాటు కొన్ని మరణా యుధాలు లభించడంతో విచారణ ప్రారంభించారు. దీంతో కుట్రకోణం వెలుగులోకి వచ్చినట్టు కూడా మంగళవారం నాటికి ప్రచారంలో ఉంది.

ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్న చిన్నబాడాంకు చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి కూర్మాపు ధర్మారావు ఆచూకీ తెలపాలని ఆయన భార్య, కుమారుడు సోమవారం పలాస డీఎస్పీని ఒక లాయర్‌తో వెళ్లి కలిశారు. ధర్మారావును ఎందుకు అదుపులోకి తీసుకున్నారో, ఎక్కడ ఉంచారో వెల్లడించాలని డీఎస్పీని కోరినట్టు తెలిసింది. అంతకు ముందు అంపోలు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు డీఎస్పీని కలిసి పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై వివరణ కోరారు. అన్ని విషయాలు కోర్టు ముందుంచుతామని డీఎస్పీ చెప్పడంతో బద్ద నాగరాజు హత్యకు కుట్ర కేసులోనే వీరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తేలిపోయింది. ఈ కేసులో బీహార్ ముఠాకు చెందిన ముగ్గురుతో కలిపి మొత్తం 11 మంది వరకు ఉన్నట్టు ప్రచారం సాగుతుంది. ఇప్పటికే పోలీసులు అదుపులో ఉన్న సుపారీ గ్యాంగ్ సభ్యులు ముగ్గురితో పాటు చిన్నబాడాంకు చెందిన ముగ్గురు, మందస మండలం జిల్లుండికి చెందిన ఒక్కరు మొత్తం ఏడుగురు పోలీసులు అదుపులో ఉన్నట్టు తెలుస్తుంది. మరో నలుగురుని అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు సిద్ధమయ్యారని భోగట్టా.

సుపారీ ఇచ్చి టీడీపీ నాయకుడి హత్యకు కుట్ర చేయడంపై జిల్లాలో తీవ్ర చర్చ సాగుతుంది. జిల్లాలో సుపారీ ఇచ్చి హత్య చేయించే సంస్కృతికి తెరతీయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పరం దాడులు చేసుకోవడం, హత్యా రాజకీయాలకు పాల్పడడం సర్వసాధారణమైపోయాయి. ఇప్పుడది జిల్లాకు పాకడంపై, మరీ ముఖ్యంగా పలాసలో ప్రారంభం కావడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలాస పట్టణ టీడీపీ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న బద్ద నాగరాజు వ్యవహారం తీవ్ర ఇబ్బందికరంగా మారిందని ప్రచారం ఉంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచే నాగరాజు చిన్నబాడాంలో అనేక మంది వైకాపా మద్దతుదారుల ఇళ్లపై దాడులకు తెగబడినట్టు తెలిసింది. నాగరాజు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. నాగరాజు అరాచకాలు మితిమీరడంతో గ్రామస్తులంతా మూకుమ్మడి దాడి చేయాలని నిర్ణయించినట్టు పలాసలో చర్చ కొద్ది రోజుల క్రితం సాగింది. ఈలోగా బీహారీ ముఠాను రంగంలోకి దించడం కలకలం సృష్టించింది.


# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- రేంజ్‌లో 41 ఎకరాల్లో గంజాయి సాగు గుర్తించాం
- మాదకద్రవ్యాలు నియంత్రణకు ఈగల్ టాస్క్‌ఫోర్స్
- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సైబర్ నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి కోరారు. మంగళవారం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి వార్షిక తనిఖీ నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలని అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దని సూచించారు. డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తారన్నారు. సైబర్ నేరాలపై 19 కేసులు నమోదయ్యాయని తెలిపారు. సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్‌గా రూపొందించేందుకు పోలీస్ యంత్రాంగం ఈగల్ టాస్క్‌ఫోర్స్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు కళాశాలలు, పాఠశాల విద్యార్థులకు సంకల్పం పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విశాఖ రేంజ్ పరిధిలో సుమారు 41 ఎకరాల గంజాయి సాగును గుర్తించినట్టు తెలిపారు. ముందుగా నగరంలోని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డీఐజీకి పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్‌స్టేషన్లో పలు ముఖ్యమైన రికార్డులు నిర్వహణ, గ్రేవ్ కేసులు ఎన్డీపీఎస్, సైబర్ క్రైమ్, మహిళలు, చిన్నారులపై జరిగిన దాడులు, హత్యానేరాలు తదితర ముఖ్యమైన రికార్డులను తనిఖీ చేసి వాటి నిర్వహణ, కేసులు దర్యాప్తుపై ఆరాతీశారు. అనంతరం మహిళా పోలీసులతో పట్టణ పరిధిలో ఉన్న సచివాలయం, మహిళా పోలీసులతో ముఖాముఖి నిర్వహించారు. గ్రామ, వార్డుస్థాయిలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సమాచారాన్ని సంబంధిత పోలీసులకు తెలపాలని సూచించారు. సైబర్ నేరాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారిని 1930 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో చురుకుగా పని చేయాలన్నారు. వార్షిక తనిఖీలలో శ్రీకాకుళం పట్టణ డీఎస్పీ సీహెచ్ వివేకానంద, పైడపునాయుడు, ఎస్సై హరికృష్ణ తదితరులు ఉన్నారు.



# రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి

(సత్యంన్యూస్, టెక్కలి)

టెక్కలిలో నిరుపేదలకు చేయూతనివ్వడానికి స్థాపించిన అభయం యువజన సేవా సంఘం నేటికి ఏడు సంవత్సరాల పూర్తి చేసుకొని 8వ సంవత్సరంలో అడుగుపెడుతుందని సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంలో అభయం సేవా సంఘం వాళ్ళు రక్త దానం, నిరుపేద కుటుంబాలకు 25 కేజీల రైస్, నిత్యవసర వస్తువుల పంపిణీ, మందులు ఖర్చు నిమిత్తం నిరుపేద పేషెంట్లకు కొంత ఆర్థిక సాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు, సెక్రటరీ లాడే కామేశ్వరరావు, సంఘసభ్యులు ఎన్ సింహాచలం, ధర్మవరపు పూర్ణాచారి అద్దాల వీరభద్రాచారి, జామి సుబ్బారావు, ఎం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.




# ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌కు దరఖాస్తులు ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీఎస్ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 19వ బ్యాచ్ హెవీ డ్రైవింగ్ శిక్షణకు గాను లైట్‌మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగినవారు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ నెల చివరిలో ప్రారంభమయ్యే ఈ శిక్షణలో కేవలం 16మందికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఫీజు, ఇతర వివరాల కోసం 7989723505, 7382923293 నెంబర్లలో సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

# ఓబీసీ సాధనే లక్ష్యంగా ముందుకుపోదాం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సొండికుల సామాజిక వర్గాన్ని ఓబీసీగా గుర్తించడమే లక్ష్యంగా ముందుకుపోదామని నవ్యాంధ్ర సొండికుల సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు నెమలిపురి కోటీశ్వర చౌదరి పిలుపునిచ్చారు. ఏ నలుగురు కలిసి న పిక్నిక్ అయిన ,ఆత్మీయ సమ్మెళనమైన ఇదే అంశంపై చర్చసాగిద్దామన్నారు. ఇటీవలే తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన పిక్నిక్ విజయవంతంగా నిర్వహించి అనేక అంశాలపై చర్చించడంపై కోటీశ్వరావు అభినందించారు. అలాగే విశాఖ సొండి కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29 విశాఖ పట్నంలో నిర్వహించనున్న పిక్నిక్ ను విజయవంతంగా చేసేందుకు అందరు కలిసి రావాలని కోటీశ్వర చౌదరి పిలుపునిచ్చారు. ఈ ఆహ్వానంతో కోటిశ్వర చౌదరికి సామాజిక వర్గాన్ని అభివృద్ధికి ఆయనలో ఉండే తపన అద్దం పడుతుందని సంఘ నేతలు అభిప్రాయపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు సహకారం అందిపుచ్చుకుందామని ఆయన చేస్తున్న ప్రయత్నానికి మద్దతిస్తూ విశాఖ పిక్నిక్‌కు తరలి పోదామని మరికొందరు నేతలు పిలుపునిచ్చారు. తెలంగాణ సొండి కుల సంక్షేమ సంఘం నిర్వహించిన కార్తీక మాస , ఆత్మీయ సమ్మెళనం దిగ్విజయంగా, కనివిని ఎరుగని రీతిలో నిర్వహించడం లో ఐక్యతకు నిదర్శనమని కోటీశ్వ చౌదరి అభిప్రాయం వ్యక్తం చేసారు . రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించినందుకు ఆయన అభినందనలు తెలియజేశారు. ప్రత్యేక ఆహ్వానితులను ఆదరించడంలో, బంధువులను అభిమానంతో అలంకరించడంలోనూ, పిల్లల ఆటపాటలతో పెద్దవాళ్ల కేరింతలతో కోలాహలంగా నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతానికి అహర్నిశలు కృషి చేసిన హైదరాబాద్ సంఘ అధ్యక్షుడు కదంబాల జీవన్‌రావు, ఉపాధ్యక్షుడు గజరావు నాగరాజు, కార్యదర్శి రత్నాల మురళి, ప్రధాన కార్యదర్శి, కదంబాల సురేష్ కుమార్ సహ కార్యదర్శి, కదంబాల ధర్మరాజు కోశాధికారి సాహుకారి త్రినాధరావు, గౌరవ అధ్యక్షులు రత్నాల ఈశ్వరరావు, వర్కింగ్ ప్రసిడెంట్ రత్నాల సంతోష్ కుమార్, వర్కింగ్ ప్రసిడెంట్లా లాభాల అప్పారావు, సంఘనాయకులు, కార్యవర్గ సభ్యులు, బంధుమిత్రులు పూర్తి సహాయ సహకారంతో దిగ్విజయంగా నిర్వహించినందుకు ప్రతి ఒక్కరికి కోటీశ్వర చౌదరి పేరు పేరునా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ నేపధ్యంలో విశాఖ పట్నంలో ఈ నెల 29న ఏపీ రాష్ట్రం తరపున నిర్వహించనున్న ఆత్మీయసమ్మెళనం ,పిక్నిక్ కు విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడిగా కోటీశ్వర చౌదరి పిలుపునిచ్చారు.

మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, శాసనసభ్యులు, ఓబీసీ సాధన కోసం కూటమి నాయకులు ఏ విధంగా సహకరిస్తున్నారనేదానిపై సమీక్షించి భవిష్యత్ ప్రణాలికను చర్చించాల్సి ఉందని అందుచేత ప్రతి ఒక్క కుటుంబసభ్యుడి రావాలని కోటీశ్వర చౌదరీ కోరుతున్నారు. సామాజిక వర్గం వెనుకబడింది..చేయూతనిచ్చి ముందుకు తీసుకేళ్లాలనీ కోటిశ్వర తపనకు జేజేలు కొడుతున్నారు. ఇప్పటికే ఆయన ఢీల్లీ అనేక పర్యాయాలూ ఓబీసి సాధనకై తిరుగుతున్నందున అంధరం విశాఖ సమావేశాన్ని విజయవంతం చేద్దామని మిగిలిన ప్రతినిధులు సామాజిక వర్గాన్ని కోరుతున్నారు.

# విశాఖలో సిక్కోలు యువకుడు మృతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



నగరానికి చెందిన బెవర హిమఆదిత్య శ్రీరామ్ (21) అనే యువకుడు విశాఖపట్నం కేర్ ఆసుపత్రి రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం రాత్రి 2.40 గంటలకు దుర్మరణంపాలయ్యాడు. నగరంలో బెవర శ్రీరాములు టింబర్ డిపో యజమాని శ్రీరాములు పెద్ద కొడుకు ప్రకాశ్ పెద్ద కుమారుడు ఆదిత్య బీటెక్ పూర్తిచేసిన తర్వాత హైదరాబాద్‌లో కొత్త కోర్సులు నేర్చుకుంటున్నాడు. రెండు రోజుల క్రితం ఆర్ఆర్‌బి పరీక్ష రాసేందుకు విశాఖపట్నం వచ్చాడు. ఇందులో భాగంగానే సోమవారం రాత్రి ఎన్‌ఫీల్డ్ బైక్ మీద కేర్ ఆసుపత్రి రోడ్డులో వెళ్తుండగా స్పీడ్‌బ్రేకర్‌ను గుర్తించకపోవడంతో రోడ్డుప్రమాదం జరిగి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యులు విశాఖ ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రికి ఆదిత్య నేత్రాలు దానంచేశారు.


FOR SALE

3BHK FLAT 2025 SFT
WITH CUPBOARDS,
INDIVIDUAL PRESSURE
MOTOR ,
4 WASHROOMS

KATTA'S SURYA PRIDE
LBS COLONY SRIKAKULAM.

94401 95559, 99881 95559


















Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.